ప్రజాశక్తి

ఆదివారం 4 ఫిబ్రవరి 2024





భానుమూర్తికి నియామక పత్రం అందజేస్తున్న జెఎన్‌టియు విసి జివిఆర్. శ్రీనివాసరావు

ఏపీ ఈసెట్-2024 కన్వీనర్‌గా పిఆర్.భానుమూర్తి

ప్రజాశక్తి-అనంతపురం

ఆంధ్రప్రదేశ్ ఇంజనీరింగ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (ఏపీఈసెట్-2024) కన్వీనర్‌గా అనంతపురం జెఎన్‌టియు ఇంజనీరింగ్ కళాశాల సివిల్ ఇంజనీరింగ్ ఆచార్యులు పిఆర్.భానుమూర్తిని నియమించారు. ఈ మేరకు జెఎన్‌టియు ఉపకులపతి జివిఆర్ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ సి.శశిధర్ శనివారం ఉత్తర్వులు జారీచేశారు. అనంతపురం జెఎన్‌టియు, ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి సంయుక్త ఆధ్వర్యంలో ఈసెట్ పరీక్షను నిర్వహిస్తారు. ఈ సందర్భంగా కన్వీనర్ భానుమూర్తి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఎపి ఈసెట్ కన్వీనర్ బాధ్యత అప్పగించినందుకు జెఎన్‌టియు విసికి కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తానన్నారు. అనంతరం భానుమూర్తికి రెక్టార్ ఎం.విజయకుమార్, రిజిస్ట్రార్ సి.శశిధర్, యూనివర్సిటీ డైరెక్టర్లు, కళాశాల ప్రిన్సిపల్ ఎస్.వి.సత్యనారాయణ, సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఎంపీ గారి ఉత్తర ప్రగల్భాలు

- ◆ కిసాన్ రైలుతో శాశ్వత పరిష్కారం చూపారట !
- ◆ కేంద్రీయ విశ్వవిద్యాలయానికి నిధుల విడుదలకు కృషి చేశారట..!
- ◆ ఈ ఏడాది కేంద్రీయ విశ్వవిద్యాలయానికి బడ్జెట్‌లో నిధులు సున్నా

అనంతపురం పార్లమెంటు సభ్యులు తలారి రంగయ్య ఈ ఐదేళ్లలో తాను సాధించిన గొప్పల గురించి తెలియజేస్తూ కరపత్రం విడుదల చేశారు. ఉత్తర పగల్భాలు పలుకుతూ ఇందులో పేర్కొన్న అంశాలు చూసి ఎంపీగారి గొప్పలు మామాలుగా లేవన్న అభిప్రాయాలు సర్వత్రా వినపడుతున్నాయి.కరపత్రంలో ఎంపీ పేర్కొన్న అంశాలు ఈ విధంగా ఉన్నాయి.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

కిసాన్ రైల్ ద్వారా ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ఉద్యానవన రైతులకు గిట్టుబాటు ధర కల్పించే విషయంలలో శాశ్వత పరిష్కారం చూపామని ఎంపీ తలారి రంగయ్య తాను విడుదల చేసిన కరపత్రంలో పేర్కొన్నారు. వాస్తవానికి కిసాన్ రైల్ 2020లో ప్రారంభమైంది. అయితే రెండు పర్యాయాలు వెళ్లిన తరువాత నుంచి కిసాన్ రైల్ ఆచూకి ఏదీ జిల్లాలో లేదు. అయితే దీని ద్వారా రైతులకు గిట్టుబాటు ధర కల్పించడం ద్వారా శాశ్వత పరిష్కారం చూపానని అనంతపురం పార్లమెంటు సభ్యులు తలారి రంగయ్య కరపత్రంలో పేర్కొనడం విడ్డూరంగా ఉంది. ఇక రెండోది కేంద్రీయ విశ్వవిద్యాలయానికి నిధులు సాధించానని చెప్పడం. కేంద్రీయ విశ్వవిద్యాలయం 2018లో ప్రారంభమైంది. అప్పటి నుంచి నిధులు కేటాయింపులు నామ మాత్రంగానే జరుగుతున్నాయి. 2024-25 సంవత్సరంలో నిధుల కేటాయింపులు చూస్తే సున్నాగా ఉన్నాయి. అయితే ఎంపీ మాత్రం నిధులు సాధించామని చెబుతున్నారు. విశ్వవిద్యాలయం ప్రారంభమైనప్పటి నుంచి చూస్తే 2023-24 సంవత్సరంలో ఒక్కటే రూ.112 కోట్లు నిధులు కేటాయించారు. అంతక మునుపు ఏడాది కేవలం రూ. 12 కోట్లే కేటాయించారు. ఇప్పటికీ శాశ్వత భవనాల నిర్మాణాలు పూర్తవలేదు. అద్దె క్యాంపస్‌ల్లోనే నడుస్తున్నాయి. కాని ఎంపీ మాత్రం నిధులు సాధించామని ప్రకటించుకోవడం చర్చనీయాంశమవుతోంది. మూడోది ప్రాజెక్టు అనంత. అనంతపురం జిల్లాకు శాశ్వత కరువు నివారణ చర్యలు చేపట్టడంపై అయ్యప్పన్ కమిటీ నివేదిక ఆధారంగా ఎనిమిది వేల కోట్ల రూపాయలతో ప్రాజెక్టు అనంతను 2012లో రూపొందించారు. అప్పటి కేంద్రంలోని కాంగ్రెసు ప్రభుత్వం దీనికి ఆమోదం తెలిపింది. కార్యాలయం కూడా ప్రారంభించారు. అయితే 2014లో వచ్చిన బిజెపి ప్రభుత్వం దీన్ని అటకెక్కించింది. నిధులు ఇంత వరకు రాలేదు. అయితే ఈ అంశాన్ని తాను ప్రస్తావించినట్లు ఎంపీ చెబుతున్నారు. దీని వలన ఎలాంటి ప్రయోజనం జిల్లాకు చేకూరిందన్న దానిపై స్పష్టతలేదు. అసలు వెనుకబడిన జిల్లాలకు కేటాయిస్తామన్న విభజన హామీనే అమలు జరగలేదు. మూడు సంవత్సరాలు ఏడాదికి రూ.50 కోట్ల చొప్పున కేటాయించి తరువాత ఆపేసింది. ఈ నిధులు రాబట్టడంపై ఎటువంటి ప్రయత్నం చేసిన దాఖలాల్లేవు.

ఇక కేంద్ర రైల్వే బడ్జెట్‌లోనూ గుంతకల్లు డివిజన్‌కు పెద్దగా నిధుల కేటాయింపుల్లేవు. గడిచిన ఐదేళ్లలో కోత్త లైన్లు ఏవీ లేవు. ఉన్న లైన్ల ఆధునీకరణకే నిధులు అరకొర కేటాయింపులతోనే సరిపెడుతున్నారు. వీటి సాధనకు చేసిన కృషి ఏపాటితో కూడా తెలియదు. కాని ఎంపీ మాత్రం జిల్లాకు గొప్పగా సాధించినట్లు ప్రకటనలిచ్చుకోవడం చర్చనీయాంశమవుతోంది.



మెరుగైన ఫలితాలు సాధించాలి

ఉన్నత విద్యామండలి ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్

ప్రజాశక్తి-హిందూపురం

ఈ ఏడాది జరిగే ఇంటర్మీడియట్ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలని ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్ సూచించారు. పట్టణంలోని చిన్నమార్కెట్‌లో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల, బాలికల ఉన్నత పాఠశాలను ఆయన శనివారం తనఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ మురళి మోహన్‌తో విద్యాబోధన,రివిజన్ గురించి అడిగి తెలుసుకున్నారు. గత సంవత్సరం 82శాతం ఫలితాలు సాధించిన విషయం తెలుసుకున్న ఆయన వచ్చే విద్యా సంవత్సరం ఇంతకన్నా మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు. ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యే నాటికి అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నాడు- నేడు పనుల ద్వారా మౌలిక వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రఘునాథ రెడ్డి, రీజినల్ ఇన్స్‌పెక్టర్ సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు అభినందన : హిందూపురం రూరల్ మండలం సంజీవరాయనపల్లి గ్రామంలో ప్రాథమిక పాఠశాలను ప్రిన్సిపల్ సెక్రెటరీ ప్రవీణ్ ప్రకాష్ తనఖీ చేశారు. ఈ సందర్భంగా ఎఫ్ఎ-3 మార్కులు, వర్క్ బుక్ లను పరిశీలించారు. ఉపాధ్యాయులు దేవి ప్రశన్న, రజని తదితరుల పనితీరును గమనించి అభినందించారు. ఈకార్యక్రమంలో ఎంఇఒ గంగప్ప తదితరులు పాల్గొన్నారు.



జూనియర్ కళాశాలలో అధ్యాపకులతో మాట్లాడుతున్న ప్రవీణ్ ప్రకాష్



విజేత జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న కలెక్టర్

రాష్ట్రస్థాయిలో పతకాలు సాధించాలి

కలెక్టర్ అరుణ్ బాబు

ప్రజాశక్తి బుక్కపట్నం

క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో రాష్ట్రస్థాయిలో పతకాలు సాధించాలని జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు ఆకాంక్షించారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన ఆడుదాం ఆంధ్ర జిల్లా స్థాయి కబడ్డీ ఫైనల్స్ పోటీల్లో బుక్కపట్నం ఈగల్స్, మడకశిర జట్లు తలపడగా బుక్కపట్నం జట్టు విజేతగా నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికైంది. ఈసందర్భంగా విజేతలకు ట్రోఫీ,మెడల్స్‌ను కలెక్టర్ అరుణ్ బాబు అందించారు. అంతకు ముందు కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో ఈనెల 9వ తేదీన విజయవాడలో జరిగే పోటీల్లో బుక్కపట్నం జట్టు పాల్గొంటుందన్నారు. క్రీడాకారులు క్రీడలతో పాటు చదువులలో రాణించాలన్నారు. ప్రతి ఒక్కరు క్రీడల్లో ముందుకు సాగాలని, గెలుపోటములను క్రీడా స్ఫూర్తితో తీసుకోవాలని చెప్పారు. తెలిపారు. విజేతగా నిలిచిన బుక్కపట్నం జట్టును గ్రామపంచాయతీ సర్పంచి నాగలక్ష్మి రాజు అభినందించారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారులు రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం గర్వకారణం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో భాగ్యరేఖ, పీడీ నాగరాజు, కబడ్డీ కోచ్‌లు శివకుమార్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో చచ్చిన కాంగ్రెస్‌ను ఆ నలుగురు మోస్తున్నారు...

మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి సంచలన వ్యాఖ్యలు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-హిందూపురం

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని వైసిపి ఎప్పుడో కబ్జా చేసిందని ఆంధ్రప్రదేశ్‌లో చచ్చి పోయిన కాంగ్రెస్ పార్టీని రఘువీరా రెడ్డి, షర్మిళ, కెవిపి.రామచంద్ర రావు, గిడుగు రుద్రరాజు మోస్తున్నారని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు ఆయన శనివారం వైసిపి పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు శాంతమ్మ, దీపికతో కలసి పట్టణంలో పర్యటించారు. 38 వార్డులలో 7 ప్రదేశాల్లో జరిగిన సమావేశాల్లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికలకు సిద్ధం కావాలని పోస్టర్లు విడుదల చేశారు. అనంతరం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ చచ్చిపోయిందని ఆ పార్టీని నలుగురు వ్యక్తులు మోస్తున్నారనిఐదవ వ్యక్తి ఎవరైనా ఉంటే ఉట్టి పట్టడానికి పనికొస్తారని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిలపై ఘాటైన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో ఎన్ని పార్టీలు కుమ్మక్కు అయినప్పటికీ వైసీపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల్లో గాలికి కొట్టుకుపోవాల్సిందేనన్నారు. సీఎం జగన్ మోహన్ రెడ్డి పై ఆయన సోదరి షర్మిళ రాజకీయ విమర్శలు గుప్పిస్తుందనిదీనిపై మీ స్పందన ఏమిటని మంత్రిని విలేకరులు ప్రశ్నించగా కాంగ్రెస్ పార్టీ తమకు పోటీనే కాదని వ్యాఖ్యానించారు, చంద్రబాబు నాయుడు కుట్రలో భాగంగానే షర్మిళ ఈ రకంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. వైసిపి ఏర్పడడానికి, జగన్ అరెస్టుకు, రాష్ట్రం విడిపోవడానికి చంద్రబాబే కారణం అన్నారు. షర్మిళ చంద్రబాబు ఉచ్చులో పడిందని, షర్మిళను తాము రాజకీయ శత్రువు గానే భావిస్తామని అన్నారు. తాను హిందూపురం నియోజక వర్గ వ్యాప్తంగా పర్యటించానని, అన్ని చోట్ల వైసిపికి ప్రజాస్పందన బాగుందని, వచ్చే ఎన్నికల్లో తప్పక గెలుస్తామన్న ధీమా వ్యక్తం చేశారు.

ఇచ్చిన ప్రతి హామిని నెరవేర్చిన ఘనత జగన్‌దే : ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామిని నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి కే దక్కుతుందనిమంత్రి పెద్ది రెడ్డి రామచంద్రా రెడ్డి అన్నారు. శనివారం హిందూపురం పట్టణంలో మేళాపురం, శ్రీకంఠపురం, హస్నాబాద్, సూగురు, రహమత్‌పురం, ఆర్‌టిసి కాలోని, వాసవి ధర్మశాల రోడ్డులో ఏర్పాటు చేసిన వార్డు ప్రజల ఆత్మీయ సమావేశాల్లో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు శాంతమ్మ, దీపికలతో పాటు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గిరిజమ్మలతో కలిసి మంత్రి పెద్ది రెడ్డి రామచంద్రా రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో మంత్రి మాట్లాడుతు గత నాలుగు దశబ్దాలుగా హిందూపురం నియోజక వర్గంలో టిడిపిని ఆదరిస్తున్నారనిఅయితే వారు ఏమి అభివృద్ధి చేశారని ప్రశ్నించారు. 2019 ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన ప్రతి హామిని నెరవేర్చారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు అన్ని సామాజిక వర్గాలకు న్యాయం జరిగే విధంగా చట్టసభల్లో కూడా అందరికీ న్యాయం చేశారన్నారు. గతంలో ఎప్పుడు లేని విధంగా ఈ సంవత్సరం రాష్ట్రంలో ఇప్పటికే ఆరు చోట్ల ముస్లిం మైనార్టీలకు టికెట్లను కేటాయించారన్నారు. ఈ సారి మహిళలకు పెద్దపీట వేస్తూ 2024లో జరిగే ఎన్నికల్లో హిందూపురం చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఈసారి వైసిపి తరపున ఎమ్మెల్యే అభ్యర్థిగా దీపిక, ఎంపీ అభ్యర్థిగా బోయ శాంతమ్మలను నిలబెట్టారన్నారు. వీరిని ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో అబ్జర్వర్ రెడ్డి ఈశ్వర్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ ఇంద్రజ, మున్సిపల్ వైస్ చైర్మన్లు బలరామి రెడ్డి, జబివుల్లా, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘనీ, రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ జనార్దన్ రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మెన్ ఫిర్దోస్ ఖలీల్, వైస్ చైర్మన్ రాచపల్లి మహీంద్రనాథ్ రెడ్డి, వైసిపి నాయకులు మధుమతి రెడ్డి, వజ్ర భాస్కర్ రెడ్డి, కౌన్సిలర్లు, టౌన్ బి బ్లాక్ కన్వీనర్ బెల్లం నరేష్, జెసిఎస్ జిల్లా కో ఆర్డినేటర్ మారుతీ రెడ్డి, టౌన్ కన్వీనర్లు శివశంకర్ రెడ్డి, నౌషాద్‌తో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈసారీ నిరాశే...!

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

దేశంలోనే అత్యల్ప వర్షపాతం కలిగిన రెండో జిల్లాగా ఉమ్మడి అనంతపురం జిల్లా ఉంది. జైసల్మీర్ తరువాత అత్యల్ప వర్షపాతం కలిగిన ఈ ప్రాంతాభివృద్ధిపై కేంద్రంలోని బిజెపి సవతి తల్లి ప్రేమనే కనబరుస్తోంది. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు నామమాత్రంగానే ఉంటున్నాయి. రాష్ట్ర విభజన సమయంలోనూ ఈ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయించడమే కాకుండా పన్ను రాయితీలు కూడా ఇవ్వాలని 2014లో బిజెపి అధికారంలోకి రాకముందు ఆ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ ప్రాంతాల్లో పర్యటించి అనేక సభలు సైతం పెట్టారు. అయితే అధికారంలోకి వచ్చాక మాత్రం ఇప్పటికీ ఈ ప్రాంతాభివృద్ధిపై ప్రత్యేకంగా చర్యలేవి ఉండటం లేదు. 2024-25 సంవత్సరానికి ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లోనూ వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి ప్రస్తావనే కనిపించలేదు. వామపక్షాలు, ఇతర అభివృద్ధిని కాంక్షించే వారందరూ రాయలసీమకు బుందేల్ ఖండ్ తరహా ప్యాకేజీనివ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఇందుకు అనుగుణంగా బిజెపి నాయకులు కూడా రాయలసీమ డిక్లరేషన్ అని ఒక సదస్సును పెట్టి ఈ ప్రాంతాభివృద్ధి తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. కానీ కేంద్రంలో అధికారంలోనున్న ఆ పార్టీకి ఈ డిక్లరేషన్‌పై స్పందన లేకపోవడం గమనార్హం. ఇది ఇలాగుంటే ఈ బడ్జెట్‌లో కేంద్రీయ విశ్వవిద్యాలయానికి ఒక్కపైసా నిధులు కేటాయించకపోవడం గమనార్హం. గత ఏడాది నిధులతో ప్రారంభమైన భవనాలతోనే సరిపెట్టేలాగా కనిపిస్తోంది. దీనిపై అధికార వైసిపి నాయకులుగానీ, ఇటు ప్రతిపక్ష టిడిపి నాయకులుగానీ ఎవరూ పల్లెత్తుమాట అనకపోవడం శోచనీయం. కేంద్రం రాష్ట్రానికి, వెనుకబడిన జిల్లాలకు అన్యాయం చేస్తున్నా ఈ సమస్యలను లేవనెత్తే ప్రయత్నం చేయడం లేదు. ఈ ఉమ్మడి జిల్లా నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న పార్లమెంటు సభ్యులు సైతం నోరు మెదపటం లేదు. పైగా తాము కిసాన్ రైళ్లను సాధించామని జబ్బలు చరుచుకుంటున్నారు. వాస్తవానికి ఉమ్మడి జిల్లా అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారిందన్న అభిప్రాయం జిల్లావాసుల్లో ఉంది. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధిపై కేంద్రం శీతకన్ను వవహించిందన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ఎన్నికలకు ముందు ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్‌లోనూ ఏ ఒక్క కొత్త ప్రాజెక్టునుగానీ, కనీసం రైల్వే లైన్‌గానీ కొత్తది రాలేదు. ఉన్న వాటికే నిధులు అరకొరగా కేటాయించారు. ఉపాధి హామీనికి నిధులు సైతం తగ్గించడంతో కరువు నెలకొన్న సమయంలో ఇప్పుడు వలసలు సైతం పెరుగుతున్నాయి. ఈ వచ్చే మాసానికి ఇవి మరింత పెరగనున్నాయి. కరువు సమయంలో వలస నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటారన్న అంశాలు కూడా బడ్జెట్‌లో లేవు. ఇప్పటికే కేంద్ర కరువు బృందాలు జిల్లాలో పర్యటించి వెళ్లాయి. అయితే ఇంత వరకూ సాయం మాత్రం ప్రకటించలేదు. పంటనష్టపోయి రైతులు సైతం కరువు సహాయం కోసం ఎదురు చూస్తున్నారు. బడ్జెట్ సమయంలోనైనా ఈ అంశాలు ప్రస్తావనకు వస్తాయనుకుంటే అవేవి లేకుండా ఉన్నాయి. కేంద్ర బడ్జెట్ మొత్తం సంపన్నులు, కార్పొరేట్ సంస్థలకు మేలు చేసే విధంగానే ఉన్నాయన్న విమర్శలున్నాయి. ఇక రాష్ట్ర బడ్జెట్‌లో కూడా వచ్చే వారం రానుంది. ఈ బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వమైనా ఈ ప్రాంతానికి కేటాయింపులు చేస్తుందా లేక కేంద్రం బాటలోనే పయనిస్తుందా అన్నది చూడాల్సి ఉంది.



గుప్తనిధుల తవ్వకాల ముఠా అరెస్టు

రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న యాడికి పోలీసులు

4 ద్విచక్రవాహనాలు, 8 సెల్ ఫోన్లు స్వాధీనం

ప్రజాశక్తి - అనంతపురం

గుప్తనిధుల తవ్వకాల ముఠాను తాడిపత్రి డీఎస్పీ గంగయ్య పర్యవేక్షణలో సి.ఐ నాగార్జునరెడ్డి, ఆయన బృందం రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని అరెస్టు చేశారు. ఈ మేరకు ఎస్పీ ఆదేశాల మేరకు తాడిపత్రి డీఎస్పీ గంగయ్య శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గుప్తనిధుల ముఠా అరెస్టు వివరాలను వెల్లడించారు.

యాడికి మండలం బోయరెడ్డిపల్లికి చెందిన కొట్టం హరి, కొట్టం పవన్‌కుమార్, చింతకాయల నాగేష్, చింతకాయల శ్రీరాములు, చింతకాయల శివ గంగ రాజు, చింతకాయల రామచంద్ర, చింతకాయల పెద్దయ్య, కొట్టం సురేంద్ర, పడమల ఓబులేసు వీరంతా సమీప బంధువులు. వీరు మూఢనమ్మకాలను అనుసరించి ఈ 9 మంది నిందితుల్లో ఒకరైన చింతకాయల శివగంగరాజు మాటలు నమ్మారు. యాడికి మండలం, గుడిపాడు గ్రామ కొండల్లోని కంబగిరి స్వామి గుడి సమీపంలో గుప్త నిధులు ఉన్నాయని భావించి వీరంతా అక్కడికి శనివారం రాత్రి వెళ్లారు. వెంట తీసికెళ్లిన పని ముట్లు ద్వారా గుడి సమీపంలో తవ్వకాలు చేపట్టారు. ఈవిషయం యాడికి సిఐ నాగార్జునరెడ్డి దృష్టికి వెళ్లింది. వెంటనే స్పందించిన సిఐ నాగార్జునరెడ్డి ఎస్పీ అన్బురాజన్ ఆదేశాల మేరకు తాడిపత్రి డీఎస్పీ సీఎం గంగయ్య పర్యవేక్షణలో తన బృందంతో వెళ్లి రెడ్ హ్యాండెడ్‌గా నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గుప్తనిధుల ముఠాను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్న పోలీసులను ఎస్పీ ఈసందర్భంగా అభినందించారు.



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ, సిఐ



కేక్ కట్ చేస్తున్న ఎడిసిసి బ్యాంక్ సిబ్బంది

ఘనంగా ఎడిసిసి బ్యాంకు వార్షికోత్సవం

ధర్మవరం టౌన్ : పట్టణంలోని బ్రాహ్మణవీధిలో ఉన్న ధర్మవరం ఎడిసిసి బ్యాంక్ 16 ఏళ్ల వార్షికోత్సవ వేడుకలను శనివారం మేనేజర్ నాగార్జున ఆధ్వర్యంలో సిబ్బంది ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. మేనేజర్ మాట్లాడుతూ బ్యాంకు ఆదివారం కూడా పని చేస్తుందన్నారు. బ్యాంకులో అందించే సేవలను వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ పురుషోత్తం, నాగవేణి, రహంతుల్లా, బ్యాంకు సిబ్బంది ప్రేమ్‌కు మార్, సునీల్‌కుమార్, లక్ష్మీప్రసన్న, సొసైటీ సిబ్బం ది, సిఇఒలు ఎస్.నారాయణస్వామి, దామోదర్, బి.నరసరావు, జి.మహేష్, జి.పృథ్వీ, నిరంజన్‌రెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి రైల్వేగేట్ వంతెన మార్గం మూసివేత

ధర్మవరం టౌన్ : ఈ నెల 4 నుంచి 23వ తేదీ వరకూ పట్టణంలోని గాంధీ నగర్ రైల్వే గేట్ వంతెన మార్గం (వందన మార్గం) మూసివేస్తున్నట్లు స్టేషన్ మాస్టర్ నరసింహనాయుడు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ధర్మవరం పట్టణం నుంచి రైల్వే స్టేషన్‌తో పాటు కొత్తపేట, చిగిచెర్ల ప్రాంతాలకు ఈ మార్గంలోనే రాకపోకలు జరిగేవని, వంతెన వద్ద ఎక్స్‌టెన్సన్ పనులు చేపట్టేందుకు వంతెన మార్గం మూసివేస్తున్నామన్నారు. వాహనదారులు గమనించి ఇతర మార్గాల్లో రాకపోకలు సాగించాలని సూచించారు.

ప్లేట్లు, గ్లాసులు పంపిణీ

కొత్తచెరువు : మండలంలోని తిరుమల దేవరపల్లి, కనిశెట్టిపల్లి ప్రాథమిక పాఠశాలల విద్యార్థుల కు శనివారం కిత్ మత్ ఎ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ శామీర్ ఆధ్వర్యంలో ప్లేట్లు, గ్లాసులు, బిస్కెట్లు పంపిణీ చేశారు. శామీర్ మాట్లాడుతూ పుట్టపర్తికి చెందిన ఎన్టీఆర్ అభిమాని శ్రీకాంత్ తన జన్మదినం సందర్భంగా వీటిని అందజేశారని తెలిపారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో విద్యార్థులు, పేదల కు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాధవి, రాజు, జావిద్ పాల్గొన్నారు.

6న అసెంబ్లీ ముట్టడి

ఓబుళదేవరచెరువు : ఈ నెల 6వ తేదీ విజయవాడలో జరగనున్న అసెంబ్లీ ముట్టడి కార్యక్రమా న్ని జయప్రదం చేయాలని సర్పంచుల సంఘం, పుట్టపర్తి నియోజకవర్గ అధ్యక్షులు శంకర్‌రెడ్డి పిలుపు నిచ్చారు. గ్రామ పంచాయతీల నిధులు మళ్లింపు, తదితర ప్రధాన డిమాండ్ల సాధన కోసం పంచాయతీ రాజ్ ఛాంబర్ జాతీయ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో అసెంబ్లీని ముట్టడిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిటిసి శ్రీనివాసులు, ధారా నాగేంద్ర పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై కమిషనర్‌కు వినతి

పెనుకొండ : పట్టణంలో నెలకొన్న తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం సిపిఎం ఆధ్వర్యంలో నగర పంచాయతీ కమిషనర్ వంశీకృష్ణ భార్గవకి వినతిపత్రం అందజేశారు. సిపిఎం మండల కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ పట్టణంలో 10 రోజులుగా తాగునీటి సమస్య తీవ్రంగా ఉండడంతో ప్రజలు సొంతంగా డబ్బులు పెట్టి కొనుగోలు చేసే దుస్థితి ఏర్పడిందన్నారు. స్పందించిన కమిషనర్ రెండు రోజుల్లోగా తాగునీటి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు హరి, తిప్పన్న, బాబావలి, గంగాధర్, రాజురావు, ఆల్ కౌసర్ సంస్థ అహ్మద్ పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ

రొద్దం : మండలంలోని తిరుమల ఫర్టిలైజర్స్, ఓం శ్రీసాయి ట్రేడర్స్ ఎరువు దుకాణాలను శనివారం ప్రత్యేక తనిఖీ అధికారి, కదిరి ఎడిఎ సత్యనారాయణ సందర్శించారు. ఆయన దుకాణాల్లో ఎరువుల నాణ్యత, రికార్డుల నిర్వహణను తనిఖీ చేశారు. రికార్డుల నిర్వహణ సరైన పద్ధతిలో చేపట్టాలని, ఎరువులను నిర్ణీత ధరకే రైతులకు అందజేయాలని, అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఎఒ కవితరాణి, ఎఇఒ అంజాద్ ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

రొద్దం : మండలంలోని పెద్దగువ్వల పల్లి గ్రామానికి చెందిన కురుబ అంజనప్ప భార్య రామలక్ష్మమ్మ అనారోగ్యంతో బాధ పడుతుండగా వినాయక సేవాసమితి సభ్యులు రూ. 16,516 అందజేశారు. కార్యక్రమంలో వినాయక సేవా సమితి సభ్యులు పాల్కొన్నారు.

వాహనాల తనిఖీ

ముదిగుబ్బ : స్థానిక కస్తూరిబా స్కూల్ సమీపంలోని పంగల్ రోడ్డులో జాతీయ రహదారిపై శనివారం సిఐ యతీంద్ర వాహనాలను తనిఖీ చేశారు. వాహనదారుల రికార్డులను పరిశీలించారు. హెల్మెట్ ధరించి వాహనం నడపాలని, అతివేగం ప్రమాదకరమని వాహనదారులకు సూచించారు. తనిఖీల్లో పోలీసులు షౌకత్, భాస్కర్, నరేష్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు సన్మానం

చెన్నేకొత్తపల్లి : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బదిలీపై వెళ్తున్న తహశీల్దార్ షాబుద్దీన్‌ను శనివారం స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో వీఆర్వోల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. విఆర్వోలు తహశీల్దార్‌కు పూలమాలలు వేసి శాలువాలతో సన్మానం చేశారు. కార్యక్రమంలో వీఆర్వోలు మహేశ్వర్‌రెడ్డి, నీరజ, నాగేంద్రబాబు, లోకేష్‌బాబు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


తహశీల్దార్ షాబుద్దీన్‌ను సన్మానిస్తున్న విఆర్‌ఒలు

నిష్పక్షపాతంగా సంక్షేమ పథకాల అమలు : మంత్రి

ప్రజాశక్తి-సోమందేపల్లి

నిష్పక్షపాతంగా పేదలకు సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం జగన్ ప్రభుత్వమని మంత్రి ఉషశ్రీచరణ్ పేర్కొన్నారు. 'ఆత్మీయ పలకరింపు'లో భాగంగా శనివారం మంత్రి మండలంలోని నడింపల్లి, కేతగానిచెరువు, చాలకూరు, బ్రాహ్మణపల్లి, పందిపర్తి, ఈదులబల్లాపురం పంచాయతీల్లో రోడ్ షో నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మీకు, మీ ఇంటికి, మీ కుటుంబానికి వైసిపి ప్రభుత్వంలో మంచి చేకూరి ఉంటే ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేయండని కోరారు. ప్రతిపక్ష పార్టీలు లేనిపోనివి ప్రభుత్వంపై రుద్దుతున్నాయని వారి మాటలు నమ్మద్దని సూచించారు. కార్యక్రమంలో ఎంపిపి గంగమ్మ వెంకటరత్నం, మండల కన్వీనర్ నారాయణరెడ్డి, జడ్పిటిసి డిసి అశోక్, సర్పంచి గంగాదేవి నరసింహమూర్తి, సేవాదళ్ అధ్యక్షులు వేణు, రమాకాంత్‌రెడ్డి, జయచంద్రరెడ్డి, సర్పంచులు రామాంజనేయులు, లలితమ్మలక్ష్మీనరసప్ప, మమతశ్రీరాములు, జిలాన్‌ఖాన్, నాగభూషణ్‌రెడ్డి, ఎంపిటిసి నాగరాజ్, నరసింహులు, సింగిల్‌విండో అధ్యక్షులు కొల్లప్ప, ఆదినారాయణరెడ్డి, కళ్యాణ్ పాల్గొన్నారు.

బయటపడ్డ అసమ్మతి : చాలకూరు లో సర్పంచి లలితమ్మ లక్ష్మీనరసప్ప ఆధ్వర్యంలో మంత్రి ఉషశ్రీచరణ్ పర్య టన విజయవంతమైంది. అయితే ఎమ్మెల్యే శంకరనారాయణ అసమ్మతి నేత అశ్వత్తమ్మ ఇంటికి మంత్రి ఉషశ్రీచరణ్ వెళ్లడంతో లక్ష్మీనరసప్ప వర్గీయులు ఆగ్రహంతో ఊగిపోయారు. అక్కడ ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలను చించేశారు. మంత్రి వెంట వెళ్లకూడదని లక్ష్మీ నరసప్పను నిర్బంధించారు. అదే పంచాయతీ లోని గుడ్డంనాగేపల్లిలో మంత్రి పర్యటన ఉండగా పంచాయతీలోని నాయకులు, కార్యకర్తలు రాకపోవడంతో మంత్రి మరో గ్రామంలో పర్యటనకు వెళ్లారు.


ప్రజలను ఓట్లు అభ్యర్థిస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్

నోటిఫికేషన్ పేరుతో వైసిపి డ్రామాలు : టిడిపి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ఎన్నికల వేళ డీఎస్సీ పేరుతో సిఎం జగన్ నిరుద్యోగులను మరోసారి దగా చేయలని చూస్తున్నా రని, ఆయన చర్యలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2019 ఎన్నికల సమయంలో ఏటా మెగా డీఎస్సీ, జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పిన జగన్ మాట తప్పారని మండిపడ్డారు. రాష్ట్రంలో 21 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉంటే 6,100 పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వడం నిరుద్యోగులు, ప్రజలను మోసం చేయడమే అన్నారు. వైసిపి అధికా రంలోకి వచ్చినప్పటి నుంచి పెట్టుబడులు కలగా మారాయన్నారు. ఈ పాలనలో ఉద్యోగాలు, పెట్టుబ డులు ఉండవు కానీ గంజాయి మాత్రం ఎక్కడచూసినా దొరుకుతుందన్నారు. సిఎం జగన్ రాజకీయ కక్ష సాధింపుల కోసం ఖాకీలను ప్రయివేటు ఫ్యాక్షన్ సైన్యంగా వాడటంతో వారికి నేరాలు అలవాటుగా మారాయన్నారు. నిరుద్యోగులను మోసం చేస్తూ రాష్ట్రాన్ని గంజాయిప్రదేశ్‌గా మార్చిన జగన్‌కు వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని శ్రీరామ్ పిలుపునిచ్చారు.

డీఎస్సీ పేరుతో మరోమారు మోసం : పల్లె



పుట్టపర్తి అర్బన్ : డీఎస్సీ పేరుతో సిఎం జగన్ మరోమారు యువతను మోసం చేశాడని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి విమర్శించారు. పట్టణంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల సమీపిస్తున్న వేళ డీఎస్సీ పేరుతో మరోసారి యువతను మోసం చేయడానికి సిఎం జగన్ కుట్ర పన్నాడన్నారు. సిఎం సభ కోసం ఇంటర్మీడియట్ పరీక్షలను వాయిదా వేయడం వారి జీవితాలతో చెలగాటం ఆడటమే అన్నారు. గంజాయి మాఫియాలో ఎపి సర్కార్ పెద్దల అండదండలు ఉన్నాయని బయటపడుతోంద న్నారు. జగన్ నిరంకుశ పాలనపై ప్రజలు తిరగబడే రోజులు దగ్గరలోనే ఉన్నాయని హెచ్చరించారు.

రేపు ఎపిసిసి అధ్యక్షురాలు షర్మిల పర్యటన

ప్రజాశక్తి-మడకశిర

ఈ నెల 5వ తేదీ ఎపిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల మడకశిర పట్టణంలో పర్యటిస్తుందని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే కె.సుధాకర్ పిలుపునిచ్చారు. పట్టణంలోని పార్టీ కార్యాలయం లో శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. షర్మిల సోమవారం ముందుగా స్థానిక వాల్మీకి సర్కిల్ నుంచి రాజీవ్‌గాంధీ సర్కిల్ మీదుగా వైఎస్ఆర్ సర్కిల్ చేరుకొని బహిరంగ సభలో ప్రసంగిస్తారన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో పట్టణ కన్వీనర్ బాబు, మండల కన్వీనర్ మంజునాథ్ పాల్గొన్నారు.

రఘువీరాపై మంత్రి పెద్దిరెడ్డి వ్యాఖ్యలు సరికాదు

నియోజకవర్గ పర్యటనలో భాగంగా మంత్రి పెద్దిరెడ్డి సిడబ్ల్యూసి మెంబర్ రఘువీరారెడ్డిపై చేసిన వ్యాఖ్యలను డిసిసి అధ్యక్షుడు కె.సుధాకర్ ఖండించారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రఘువీరా పదవుల కోసం ఏనాడూ ఆశ పడలేదన్నారు. రాహుల్‌గాంధీ కోసం, నియోజకవర్గంలో రాజకీయాలను గాడిన పెట్టడానికే రఘువీరా మళ్లీ రాజకీయాల్లోకి వచ్చారన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డిసిసి అధ్యక్షుడు సుధాకర్

రఘువీరా ప్రజలకు చేసిన సేవలను గుర్తించి పదవులు దక్కాయన్నారు. అలాంటి నాయకుడిపై మంత్రి పెద్దిరెడ్డి చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో వైఎస్ మడకశిర నుంచే 'పల్లె బాట'ను ప్రారంభించారని, అదేబాటలో షర్మిల ఈ నెల 5వ తేదీ మడకశిర నుంచి పల్లెబాట ప్రారంభిస్తారని గుర్తుచేశారు.

తారురోడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే

గాండ్లపెంట : మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన నూతన తారురోడ్లను శనివారం ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్ధారెడ్డి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సోమయాజులపల్లి పంచాయతీలోని మునగలవారిపల్లి నుంచి కత్తివారిపల్లి మీదుగా చిన్నక్కగారి పల్లికి రూ. 1.91 కోట్ల వ్యయంతో తారు రోడ్డు, గుడ్డివెలగల పంచాయతీలో రూ. 1.72 కోట్ల వ్యయంతో నీరుకుంట్లపల్లి నుం చి గుడ్డివెలగల వరకూ తారు రోడ్డు వేయించామన్నారు. కార్యక్రమంలో ఎంపిపి జగన్‌మోహన్, వైసిపి మండల కన్వీనర్ జి.రవీందర్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు ఎస్‌పి హైదర్, భాస్కర్‌రెడ్డి, సర్పంచులు రవీంద్రనాయక్, ఆంజనేయులు, సింగిల్‌విండో డైరెక్టర్ రాజన్న, పామిడి మహమ్మద్ ఇక్బాల్, ప్రతాప రెడ్డి, ఉత్తన్న పాల్గొన్నారు.


తారురోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సిద్ధారెడ్డి

వచ్చే ఎన్నికల్లో టిడిపికి పట్టం కట్టండి

ధర్మవరం టౌన్ : సార్వత్రిక ఎన్నికల్లో టిడిపికి పట్టం కట్టాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శి కమతం కాటమయ్య, పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్ ప్రజలను కోరారు. టిడిపి పట్టణ ప్రచార కమిటీ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని 2వ వార్డులో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. తెలుగుతమ్ముళ్లు ఇంటింటికీ వెళ్లి సూపర్‌సిక్స్, మినీమేనిఫెస్టో పథకాలను, వైసిపి ప్రజా వ్యతిరేక, అరాచక పాలన గురించి వివరించారు. టిడిపిలో చేరాలనుకునే వారిపై కేసులు బనాయించి జైలుకు పంపుతున్నారంటే వైసిపిలో ఓటమి భయం పట్టుకుందనడానికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో నాయకులు రాళ్లపల్లి షరీఫ్, శీలామూర్తి, జిలకర శీన, రావులచెరువు కుళ్లాయప్ప, మాబు, మాధవరెడ్డి, గంగారావు రవి, గోసల శ్రీరాములు, పల్లపు శివశంకర్, రాజు, నాగేంద్ర, వీరన్న పాల్గొన్నారు.

వాల్మీకులపై ఎమ్మెల్యే అక్రమ కేసులు

ధర్మవరం టౌన్ : ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డికి ఓటమి భయం పట్టుకుని వాల్మీకులపై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపుతున్నారని టిడిపి వాల్మీకి సంఘం సీనియర్ నాయకులు మద్దిలేటి, తలారి చంద్రమోహన్‌బాబు, బోయ రవిచంద్ర మండిపడ్డారు. మండలంలోని గుట్టకిందపల్లిలో శనివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నియోజకవర్గంలో వాల్మీకులు అధికంగా టిడిపితో ఉన్నారని, వారిని ఎలాగైనా భయాందోళనకు గురి చేసేలా వైసిపి కుట్ర పన్నుతుందన్నారు. గుట్టకింద పల్లికి చెందిన వాల్మీకి నరేశ్ టిడిపిలో చేరతాడని అధికార పార్టీ నాయకులు పోలీసులపై ఒత్తిడి చేసి పీడీ యాక్టు కింద కేసు నమోదు చేయించడం తగదన్నారు. సమావేశంలో వాల్మీకి సంఘం నాయ కులు బొట్టు కిష్ట, జింకల రాజన్న, చీమల రామాంజి, పూజా మొబైల్ సాయి, చీమల నాగరాజు, అంకే దుర్గేశ్, పూలకుంట్ల మహేశ్ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు ప్రభుత్వానికి పట్టవా.?

ఓబుళదేవరచెరువు : భవన నిర్మాణ రంగం కార్మికుల సమస్యలు రాష్ట్ర ప్రభుత్వానికి పట్టవా అని సిఐటియు నాయకులు ప్రశ్నించారు. కార్మికులు తహశీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఐదో రోజుకు చేరుకున్నాయి. శనివారం సిఐటియు బేల్దారుల సంఘం జిల్లా కార్యదర్శి సాంబశివ, సిఐటియు జిల్లా అధ్యక్షులు లక్ష్మీనారాయణ, మండల అధ్యక్షులు కుళ్లాయప్ప, కార్యదర్శి శ్రీరాములు మాట్లాడుతూ మండలంలోని భవన నిర్మాణ కార్మికులకు ఇంటి పట్టాతో సహా ఇల్లు నిర్మించి ఇవ్వాలని పలుమార్లు ఆందోళనలు చేసినా ఫలితం లేదన్నారు. వీరి సమస్యలపై దశల వారీగా పోరాటాలు చేపడతామని హెచ్చరించారు. దీక్షలో సంఘం మండల అధ్యక్షులు కిష్టప్ప, సహాయ కార్యదర్శి కేశవ, రమణ, సూరి, రవి, శ్రీనివాసులు, మహేష్, సురేంద్ర, చాంద్‌బాషా, కేశవ, అంజనప్ప, నాగరాజు, వెంకటేష్, సూర్యనారాయణ, అల్లా బకాష్, అలీ, సభ్యులు పాల్గొన్నారు.

'విభజన చట్టం' హామీలు అమలుచేయాలి

గోరంట్ల : విభజన చట్టంలో పొందుపరిచిన హామీలను కేంద్ర ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని పెనుకొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి నరసింహులు డిమాండ్ చేశారు. గోరంట్లలో శనివారం ఆయన మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టును కేంద్రమే పూర్తి చేయడంతో పాటు విభజన చట్టం మేరకు ప్రత్యేక హోదా ఇవ్వాలన్నారు. తద్వారా కేంద్రం నుంచి 90 శాతం నిధులు ఎక్స్‌గ్రేషియా రూపంలో వస్తాయన్నారు. ఆ నిధులు తిరిగి చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ప్రత్యేకహోదా ఇస్తే పరిశ్రమలకు రాయితీ లు లభిస్తాయని, తద్వారా రాష్ట్రం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందన్నారు. దుగరాజుపట్నం ఓడరేవు, విశాఖ రైల్వే జోన్‌కు నిధులు, రాష్ట్రానికి రావాల్సిన నిధులను ఈ బడ్జెట్‌లోనే కేటాయించాలని డిమాండ్ చేశారు.

గ్రామీణులకూ మెరుగైన వైద్య సౌకర్యాలు

మడకశిర : గ్రామీణ ప్రాంతాల్లోని రోగులకు మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించాలని తాలూకా సంఘం అధ్యక్షుడు, రొళ్ల జడ్పిటిసి బి.అనంతరాజు తెలిపారు. రొళ్లలో నూతనంగా నిర్మించిన ఆసుపత్రి భవనాన్ని శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణులకు సైతం కార్పొరేట్ వైద్యం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం నూతనంగా అధునాతన సౌకర్యాలతో ఆసుపత్రి భవనం నిర్మించిందన్నారు. వైద్యులు రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో కన్వీనర్ నరసింహా రెడ్డి, ఎంపిటిసి నాగేంద్ర, డాక్టర్లు దివాకర్‌బాబు, ప్రణీతరెడ్డి, వైసిపి నాయకుడు శ్రీనివాస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

హిందూపురం : పట్టణంలోని తూమకుంట చెక్‌పోస్ట్ వద్ద ఉన్న కుశాల్ ఆరోగ్య కేంద్రంలో శనివారం వాసవీ మహిళా మండలి, విప్రో కేర్ సహకారంతో కుశాల్ హెల్త్ కేర్ క్లినిక్ వైద్యులు ఉచిత గర్భాశయ వైద్య శిబిరం నిర్వహించారు. 46 మందికి వైద్య పరీక్షలు చేశారు. గైనకాలజిస్ట్ డాక్టర్ నందిత మాట్లాడుతూ సర్వైకల్ క్యాన్సర్ లక్షణాలు, జాగ్రత్తలను వివరించారు. శిబిరంలో కుశాల్ ప్రాజెక్టు సిబ్బంది డాక్టర్ అరుణ, శిరీష, మల్లీశ్వరి, లక్ష్మమ్మ, రాధమ్మ, కృష్ణవేణి పాల్గొన్నారు.


చౌక దుకాణాన్ని తనిఖీ చేస్తున్న జెసి అభిషేక్‌కుమార్

చౌక దుకాణం తనిఖీ

పుట్టపర్తి అర్బన్ : మున్సిపాలిటీ పరిధిలోని ఎనుములపల్లి చౌక దుకాణాన్ని శనివారం జెసి అభిషేక్‌కుమార్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వంశీకృష్ణరెడ్డి తనిఖీ చేశారు. జెసి మాట్లాడుతూ డీలర్లు అవకతవకలకు పాల్పడకుండా నిత్యావసర వస్తువులు పంపిణీ చేయాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరల మేరకే విక్రయించాలని, తూకంలో మోసాలకు పాల్పడినా, బ్లాక్ మార్కెట్‌కు తరలించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. లబ్ధిదారులకు విక్రయించే సమయాన్ని, ధరలను బోర్డులో వెల్లడించాల న్నారు. వారి వెంట సిఎస్‌డిటి రమేష్, విఆర్‌ఒలు ఉన్నారు.

బైక్‌లు ఢీ.. ముగ్గురికి గాయాలు

ముదిగుబ్బ : మండలంలోని కాకతీయ డాబా సమీపంలో జాతీయ రహదారిపై శనివారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొన్న ప్రమాదంలో ముదిగుబ్బకు చెందిన లోకేష్‌ఆచారి, నల్లమాడకు చెందిన ఆసిఫ్, హరి గాయపడ్డారు. సమాచారం తెలుసుకున్న సిఐ యతీంద్ర, పోలీసులు సంఘటనా స్థలానికి చేరకుని క్షతగాత్రులను 108 వాహనంలో బత్తలపల్లి ఆర్‌డిటి ఆసుపత్రికి తరలించారు.

కోర్టు ఉత్తర్వులను అమలు చేయండి

చిలమత్తూరు : కొడికొండ చెక్‌పోస్ట్‌లో సర్వేనెంబర్ 805-6, 805-7లో పేదలు వేసుకున్న గుడిసెల విషయంలో కోర్టు ఉత్తర్వులను అమలు చేయాలని కోరుతూ శనివారం సిపిఎం ఆధ్వర్యంలో ఇంటి స్థలాల సాధన కమిటీ సభ్యులు తహశీల్దార్ నాగరాజుకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వ్యకాసం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్, లక్ష్మీనారాయణ, వెంకటేష్, రామచంద్ర, చందు, రహంతుల్లా, సదాశివరెడ్డి పాల్గొన్నారు.

బదిలీ ఎంపిడిఒకు సన్మానం

గోరంట్ల : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎంపిడిఒ రఘునాథ్‌గుప్తా కర్నూలు జిల్లాకు బదిలీ కావడంతో శనివారం ఎంపిడిఒ కార్యాలయంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ మండలం అభివృద్ధికి ఎంపిడిఒ ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రమీలమూర్తి, సర్పంచులు మణిశివశంకర్‌రెడ్డి, సువర్ణఅశ్వర్థరెడ్డి, నరసింహమూర్తి, గంగప్ప, రమణ, కార్యదర్శులు శంకర, మస్తాన్, నాగరాజు, దీపక్‌కుమార్, బాబురావు, గంగాధర్, స్వప్న, యశోద, బాబ్‌జాన్, సోమశేఖర్, ఎపిఒ వరప్రసాద్ పాల్గొన్నారు.


ఎంపిడిఒ రఘునాథ్‌గుప్తాను సన్మానిస్తున్న సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు

పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి నేనే

టిడిపి జిల్లా అధ్యక్షులు బికె పార్థసారధి

ప్రజాశక్తి-పెనుకొండ

2024 ఎన్నికల్లో పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి నేనేనని, అందులో ఎవరికీ ఎలాంటి అనుమానం వద్దని టిడిపి జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారధి స్పష్టం చేశారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. బికె మాట్లాడుతూ పార్టీ అధినేత చంద్రబాబు నాకు భరోసా, నేను మీకు భరోసా అన్నారు. ఐదేళ్లుగా నియోజకవర్గంలో అందరికీ అందుబాటులో ఉండి పార్టీ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించి విషయం పార్టీకి, నాయకుల కు తెలుసు అన్నారు. మీరు నాకు అండగా ఉండండి.. నేను మీకు అండగా ఉంటానని చంద్రబాబు సహకారంతో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసుకుందామని తెలిపారు. కార్యక్రమంలో నాయకు లు జివిపి నాయుడు, కేశవయ్య, చిన్నప్పయ్య, బోయ నాగరాజు, రవిశంకర్, కార్యకర్తలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బికె పార్థసారధి

'గురుకుల' పాఠశాల వద్ద విద్యార్థి సంఘాల ఆందోళన

ప్రజాశక్తి-మడకశిర

గుడిబండలోని మహాత్మ జ్యోతిబా పూలే గురుకుల బాలికల పాఠశాలలో పలువురు విద్యార్థినులకు దురద సోకిందనే సమాచారంతో ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నాయకులు పాఠశాల వద్ద ఆందోళన చేపట్టారు. ఎస్ఎఫ్ఐ, పిడిఎస్‌యు, ఎఐఎస్ఎఫ్, టిఎన్ఎస్ఎఫ్, ఎన్ఎస్‌యుఐ నాయకులు బాలికల ఇబ్బందులను ప్రిన్సిపల్ హబ్సిబా, బిసి వెల్ఫేర్ కన్వీనర్ ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ ముస్తఫా దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఆ సమస్య 3 నెలల క్రితం ఉన్న మాట వాస్తవమే, ప్రస్తుతం ఎలాంఇ ఇబ్బందులు లేవని తెలిపారు. ఏమైనా ఉంటే తక్షణమే పరిష్కరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ సభ్యులు శివకుమార్, నాగేంద్ర, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వీరేష్, ఎఐఎస్ఎఫ్ చంద్రశేఖర్, టిఎన్ఎస్ఎఫ్ మురళి, ఎన్ఎస్‌యుఐ నవీన్‌కుమార్, అజయ్ కుమార్, విద్యార్థి సంఘాల నాయకులు ఉమేష్ నాయక్, సిపిఐ తాలూకా ఇన్‌ఛార్జి పవిత్ర, సిపిఎం నాయకులు రామాంజనేయులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి అంతమంది సలహాదారులు అవసరమా..?

ప్రజాశక్తి-పెనుకొండ

వైసిపి ప్రభుత్వానికి అంత మంది సలహాదారులు అవసరమా అని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ ప్రశ్నించారు. పట్టణంలోని తన కార్యాలయంలో శనివారం ఆమె మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం సలహాదారుల రూపంలో తన వారికి రూ. 680 కోట్ల ప్రజాధనం ఖర్చు చేపిందని, ఒక్క సజ్జల రామకృష్ణారెడ్డికే రూ. 140 కోట్లకు పైగా ప్రజాధనం అప్పగించారని విమర్శించారు. ప్రజలకు, ప్రజాధనానికి బాధ్యతగా ఉండాల్సిన ప్రభుత్వం సలహాదారులకు రూ. కోట్లలో ప్రజాధనం ఇవ్వడం ఆర్థిక అరాచకానికి పరాకాష్ట అన్నారు. సిఎం జగన్ ఇష్టారాజ్యంగా సలహాదారులను నియమించారని, స్పెషల్ కేటగిరీ కింద నియమించి క్యాబినెట్ హోదా ఎలా కల్పిస్తారని ప్రశ్నించారు. అరాచక ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు. ఆమెతో పాటు నాయకులు మాధవనాయుడు, వెంకటరమణ, డివి ఆంజనేయులు, సూర్యనారాయణ, ప్రసాద్, మాగేచెరువు సర్పంచి నరసింహులు ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సవితమ్మ

అజాగ్రత్త వల్లే రోడ్డు ప్రమాదాలు : ఎంవిఐ

ప్రజాశక్తి-బత్తలపల్లి

వాహన డ్రైవర్ల అజాగ్రత్త వల్లే రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని కదిరి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వరప్రసాద్ పేర్కొ న్నారు. స్థానిక శ్రీజ్యోతి హైస్కూల్‌లో శనివారం జాతీ య రహ దారి భద్రతా మాసోత్సవాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంవిఐ వరప్రసాద్, కరస్పాం డెంట్ మిడతల ధర్మతేజ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. డ్రైవర్ల అజాగ్రత్త, వాహన యాంత్రిక లోపాలు, సరైన రహదారులు లేకపోవడం, రహదారి నియమాలు పాటించకపో వడం, తదితర కారణాల వల్ల ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడడం, అతివేగం ప్రమాదకరమన్నారు. తప్పనిసరిగా రహదారి నియమాలు తెలుసుకుని పాటించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటరాముడు, నాగ పెద్దిరాజు, కాటమయ్య, శంకరయ్య, రాజశేఖర్, కానిస్టేబుల్ సురేష్, బాషా, కృష్ణమూర్తి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంవిఐ వరప్రసాద్

'సామకోటి' ఆధ్వర్యంలో 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

పుట్టపర్తి క్రైమ్ : మున్సిపాలిటీ పరిధిలోని ఎనుములపల్లిలో శనివారం టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. జగన్ ప్రభుత్వం చేసిన మోసాలు, ధరల పెరుగుదల, తదితర అంశాలను ప్రజలకు వివరించారు. ఆయన మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వచ్చాక హంద్రీనీవా కాలువల ద్వారా సాగు, తాగునీటి సమస్య తీరుస్తామని నారా లోకేష్ హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శ్రీనివాసులు, చెన్నప్ప, వెంకట్రాముడు, బయపరెడ్డి, చిన్నన్న, వెంకటేష్, నారాయణ, తలారి కిష్ట, రమణ, వెంకటేష్, నారాయణస్వామి, కార్యకర్తలు పాల్గొన్నారు.


కరపత్రాలను పంపిణీ చేస్తున్న సామకోటి

లింగ సమానత్వాన్ని ప్రోత్సహించాలి

ధర్మవరం టౌన్ : లింగ సమానత్వాన్ని ప్రోత్సహించడానికే మహిళా వైద్యుల దినోత్సవం జరుపుకుంటారని స్పందన హాస్పిటల్ డాక్టర్ పావని తెలిపారు. మహిళా వైద్యుల దినోత్సవం సందర్భంగా శనివారం ఆమె మాట్లాడుతూ వైద్య రంగంలో మహిళలు ఇప్పటికే ఎన్నో విజయాలు సాధించారని, నేడు అన్ని రంగాల్లో ముందంజలో ఉన్నారని తెలిపారు. వైద్య వృత్తిలో లింగ సమానత్వం కోసం కొనసాగుతున్న సవాళు, అవకాశాల గురించి అవగాహన పెంచుకోవడానికి ఇది చక్కటి అవకాశం అన్నారు.

కరీంనగర్ జిల్లా సత్యసాయి భక్తుల సందడి

పుట్టపర్తి అర్బన్ : ఉమ్మడి కరీంనగర్ జిల్లా సత్యసాయి భక్తుల పర్తియాత్రతో శనివారం పుట్టపర్తిలో సందడి నెలకొంది. ఆ జిల్లాల నుంచి 5 వేల మంది భక్తులు పత్తియాత్రలో పాల్గొన్నారు. వారు పురవీధులోల భక్తి గేయాలు ఆలపించారు. సాయి కుల్వంత్ హాలులో సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. ఉదయం, సాయంత్రం భజనలో పాల్గొన్నారు. సాయంత్రం బాల వికాస్ విద్యార్థులు నిర్వహించిన సంగీత విభావరి, నృత్యాలు అలరించాయి.

రైతుల విద్యుత్ సమస్యలపై రాస్తారోకో

ముదిగుబ్బ : మండలంలోని గుంజేపల్లి, పొడరాళ్లపల్లి, రామస్వామి నాయక్ తండా, గుడ్డంపల్లి తండా, మంగళమడక, తదితర గ్రామాల రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. వీరికి సిపిఐ నాయకుడు చల్లా శ్రీనివాసులు, టిడిపి నేత మనోహర్ మద్దతు పలికారు. రాస్తారోకో వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలగడంతో సిఐ యతీంద్ర అక్కడికి చేరుకున్నారు. రైతుల సమస్యను ఫోన్ ద్వారా ట్రాన్స్‌కో ఎడి సుబ్రహ్మణ్యంకు వివరించగా త్వరలోనే పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు.

నూతన రూరల్ సిఐని కలిసిన వైసిపి నాయకులు


ముదిగుబ్బ : స్థానిక సర్కిల్ కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన రూరల్ సిఐ కృష్ణంరాజునాయక్‌ను శనివారం వైసిపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. సిఐని కలిసిన వారిలో జడ్పిటిసి తిరుమల సేవేనాయక్, మండల కన్వీనర్ సివి.నారాయణరెడ్డి, భాస్కర్ ఉన్నారు.

'అంబికా'కు టిడిపి ఎంపీ టికెట్ కేటాయించాలి

హిందూపురం : వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో హిందూపురం పార్లమెంట్ టిడిపి టికెట్‌ను అంబికా లక్ష్మీనారాయణకు కేటాయించాలని వాల్మీకి సంఘం నాయకులు కోరారు. పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం వారు విలేక రుల సమావేశంలో మాట్లాడుతూ అంబికా 20ఏళ్లుగా పార్టీలో కీలకంగా పని చేస్తున్నారన్నారు. కావున 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఆయనకే ఎంపి సీటు కేటాయించాలని, లేనిచో టిడిపి ఎంపి అభ్యర్థికి వ్యతిరేకంగా వాల్మీకులు పనిచేస్తామని హెచ్చరించారు. సమావేశంలో వాల్మీకి సంఘం నాయకులు వైటిపి వెంకటరమణ, పూలకుంట సర్పంచి మంజూనాథ్, ఆదినారాయణ, వెంకటరమణ పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన 'పురం' నూతన ఎంపిడిఒ

హిందూపురం : హిందూపురం నూతన ఎంపిడిఒగా శనివారం వెంకటేశ్వరరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న ఎంపిడిఒ నరేంద్రకుమార్ బదిలీపై వెళ్లడంతో కర్నూలు జిల్లా అవుకు మండలం నుంచి వెంకటేశ్వరరెడ్డి ఇక్కడికి వచ్చారు.


బాధ్యతలు స్వీకరించిన ఎంపిడిఒ వెంకటేశ్వర రెడ్డి